ప్రజారాజ్యం

ప్రజలే ప్రభువులు

సంపుటి : 1
సంచిక : 11

లోక్‌సత్తా 'ఇ' సమాచారపత్రం

జూన్ 1 -15 , 2006

# నూతన రాజకీయ సంస్కృతి ఆవశ్యకత

## చర్చాపత్రం

*(కొత్త రాజకీయ సంస్కృతి ఆవశ్యకతను ఈ చర్చాపత్రం వివరిస్తుంది. ప్రస్తుత రాజకీయ పరిస్థితి మీద ఈ చర్చాపత్రంలో ప్రస్తావించిన అంశాలు ఏదో ఒక రాజకీయ పార్టీ మీద లేదా పార్టీల మీద చేసిన విమర్శ కాదు. స్థూలంగా రాజకీయాల్లో వున్న స్థితిని మాత్రమే ఇది వివరిస్తుంది. రాజకీయ రంగాన్ని సంస్కరించాలనేవాళ్ళు వివిధ పార్టీల్లో వున్నారు. ప్రజాసేవ కోసం రాజకీయల్లోకి వచ్చిన వారు, కొనసాగుతున్నవారు వున్నారు. రాజకీయాల్లో వున్న వారంతా అవినీతిపరులు, నేరచరితులేనన్న దురభిప్రాయానికి రాకూడదు. ఈ అంశాలను దృష్టిలో పెట్టుకుని అందరూ ఈ చర్చలో పాల్గొనవలసిందిగా, అభిప్రాయాలను తెలియజేయాల్సిందిగా, కార్యాచరణకు రూపం ఇవ్వాల్సిందిగా కోరుతున్నాం.)*

## I. ప్రజాస్వామ్యానికి ప్రమాద సూచికలు

మన రాజకీయ వ్యవస్థలో, సామాజిక వ్యవస్థలో అత్యంత గుణాత్మకమైన మార్పులు తక్షణావసరంగా వున్న తరుణంలో మనం వున్నాం.

సమాజహితం కోసం సాగించే పవిత్ర వ్యాసంగంగా వుండాల్సిన రాజకీయం ఇప్పుడు కేవలం అధికార క్రీడగా వికృతరూపం ధరించింది. ఎన్నికల్లో గెలుపుకోసం కోట్లు ఖర్చుపెట్టడం తిరిగి అక్రమ సంపాదనకు పాల్పడడం, అంతకు పదిరెట్లు దండుకోవడమే రాజకీయం అయింది. అందుకే ప్రజల చుట్టూ తిరగాల్సిన రాజకీయం పదవిచుట్టూ తిరుగుతున్నది. రాజకీయమే అవినీతికి కేంద్రం కావడంతో పాలనాయంత్రాంగమూ అదే దారి పట్టింది. కంచే చేను మేసినట్లు సుపరిపాలనా సాధనాలు కావలసిన రాజకీయ వ్యవస్థ, పాలనావ్యవస్థలు అవినీతికి, అధికార దుర్వినియోగానికి నిలయాలయ్యాయి. దాంతో ప్రజలకు కష్టాలు, కడగండ్లు మిగులుతున్నాయి.

ప్రభుత్వ కార్యాలయాలలో లంచం లేకుండా సేవలు అందడంలేదు. పోలీసుస్టేషన్లలో చేయి తడపకుండా కేసులు నమోదు కావడంలేదు. గ్రామాలలో పట్టణాలలో ప్రజల అవసరాలు తీర్చగల స్థానిక ప్రభుత్వాల ఏర్పాటు కాగితాల మీదే ఉండిపోయింది. పని చెయ్యని పాఠశాలలు, తెరవని ఆరోగ్యకేంద్రాలు ప్రజలకు ప్రభుత్వ సేవలపట్ల ప్రజలకు ఎలాంటి విశ్వాసాన్ని కలిగించలేకపోతున్నాయి. వ్యవసాయం లాభసాటి కాకుండా పోయింది. రైతులు ఆత్మహత్యలు కొనసాగుతున్నాయి. శక్తిసామర్థ్యాలు పెంపొందించని చదువుతో, సమాజ అవసరాలకు తగిన నైపుణ్యాల లేమితో యువత భవిష్యత్తు అంధకారం అవుతున్నది. సత్వరన్యాయం అందుబాటు కాకుండా పోయింది.

ఎక్కడ అన్యాయం జరిగినా, ఏ సమస్య తలెత్తినా దానికి పాలనాపరమైన పరిష్కారం దొరుకుతుందన్న నమ్మకం ప్రజల్లో నానాటికీ తగ్గిపోతున్నది. ఏ చిన్న సమస్యనైనా వెలుగులోకి తేవడానికి ప్రజలు బండ పద్ధతులకి, విధ్వంసకాండకి పూనుకుంటున్నారు. హింస, దౌర్జన్యం, పార్లమెంటరీ యేతర పద్ధతులు చెలరేగుతున్నాయి. వాటికి ప్రజల సమర్థన లభిస్తున్నది. ప్రజాస్వామిక సంస్థలు పనిచెయ్యక పోవడం, సేవలు అందించే వ్యవస్థలు అవినీతిలో కూరుకుపోవడం, వీటిని నడిపించే రాజకీయం అధికారక్రీడలో

**చర్చలో పాల్గొనండి
మీ అభిప్రాయాలు
పంపండి**

మునిగితేలడం ఈ పరిస్థితికి దారితీసింది. ఇదే కొనసాగితే ప్రజలకు ప్రజాస్వామ్యం మీద విశ్వాసం సన్నగిల్లుతుంది. ఊహించని విపరిణామాలు చోటుచేసుకుంటాయి.

చర్చాపత్రం

రాజకీయరంగంలోనే కాదు మన సామాజిక రంగంలోనూ ఇలాంటి అవ్యవస్థ నెలకొంది. పుట్టుకతో వివక్షతకు గురి అవుతున్న తరగతులు, వర్గాలు, రాజకీయ సామాజిక రంగాలలో తమ వాటా కోసం, తమ గుర్తింపు కోసం, తమ ఆత్మగౌరవం కోసం రకరకాల ప్రయత్నాలు చేస్తున్నాయి. నిజమైన రాజకీయం దీనిని పట్టించుకోవాలి. దళితులు, బలహీనవర్గాలు, మహిళలు చేస్తున్న ఇలాంటి ప్రయత్నాలను ఒక సామాజిక ఉద్యమంగా మలచడం రాజకీయం చేయవలసిన పని. కానీ, ప్రస్తుత రాజకీయం ఈ అంశాలను తమ ఓటు బ్యాంకు రాజకీయాలకు చాకచక్యంగా వినియోగించుకునే చాణక్యనీతిని ప్రదర్శిస్తున్నది. దీనివల్ల ఒక సామాజిక ఉద్యమంగా రూపాంతరం చెందాల్సిన దళితుల ఉద్యమాలు కుల, ఉపకుల ఉద్యమాలుగా మారి, అంతర్గత సంఘర్షణలో కొట్టుమిట్టాడుతున్నాయి. బలహీనవర్గాలు తమ గుర్తింపు కోసం చేతివృత్తి సంఘాలు నెలకొల్పుకున్నాయి. తమ ఆత్మగౌరవం కోసం ఆరాటపడుతున్నాయి. సమాజానికి పనికి వచ్చే ప్రతి వృత్తీ గౌరవప్రదమైన కార్యాకలాపంగా అందరూ భావించాలి. ప్రజలు గుర్తించే విధంగా దీనిని ఒక సామాజిక ఉద్యమంగా రాజకీయం మల్చలేకపోయింది. బలహీన వర్గాలలో వివిధ కులాల మధ్య సమన్వయం సాధించాల్సిన రాజకీయం ఆ విభజనను తన రాజకీయ లబ్దికి వినియోగించుకుంటున్నది.

సమాజంలో సగభాగంగా వున్న మహిళలు పుట్టుకతో వివక్షతకు గురౌతున్నారు. స్త్రీ విముక్తి ఉద్యమాలు కొందరిని ప్రభావితం చేసినా, అవి విశాలమైన సామాజిక ఉద్యమ రూపం ధరించలేదు. దీనికి తోడు ప్రాంతీయ, ఉపప్రాంతీయ వ్యత్యాసాలు, మిగిలిన తరగతుల లోని పేదలు తమ సామాజిక స్థితిగతుల మీద తీవ్రంగా ఆందోళన చెందుతున్నారు. ఇలా పుట్టుకతో వివక్షత, లింగవివక్షత, అభివృద్ధిలో తారతమ్యాలు, పేదరికపు అంతరాలు మన సమాజంలో తీవ్ర అసంతృప్తికి కారణాలు అవుతున్నాయి. రాజకీయం ఈ సమస్యల్ని వినియోగించుకుంటున్నదే కాని ఈ సమస్యల్ని అర్థం చేసుకుని ఆచరణయోగ్యమైన పరిష్కారాల్ని అన్వేషించడం లో పూర్తిగా విఫలం అవుతున్నది.

ఇదే పద్ధతి కొనసాగితే మన సమాజం నిరంతరం అంతర్గత సంఘర్షణలకి లోనౌతుంది. ఒకరి అభివృద్ధి మరొకరికి కంటగింపు అవుతుంది. ఒకరి అవకాశం మరొకరికి అసంతృప్తి అవుతుంది. రాజకీయం ఈ సమస్యలపై దృష్టి సారించకపోతే మన సమాజమే అతలాకుతలం అవుతుంది.

మన ప్రజాస్వామ్యానికి ప్రమాద సూచికంగా ఉన్న ఈ సమస్యలకు, సవాళ్ళకు మనం తక్షణం పరిష్కారాన్ని వెదకాలి. అందుకు తగిన నూతన రాజకీయ సంస్కృతిని నెలకొల్పడానికి, సామాజిక అంతరాలను తొలగించడానికి తగిన ప్రత్యామ్నాయాన్ని రూపొందించుకోవాలి. మన ప్రజాస్వామ్యాన్ని సుస్థిరం చేసుకోవడానికి, అభివృద్ధిక్రమాన్ని వేగవంతం చెయ్యడానికి, ప్రజల ఉజ్వల భవిష్యత్తుకూ ఇది తప్పనిసరి అవసరం అయింది.

## II . ఈ రాజకీయం ఇలా కొనసాగవలసిందేనా?

### 1. ప్రజాస్వామ్యంలో ప్రజలు ప్రభువులా ! కేవలం ఓటర్లా !

ప్రజాస్వామ్యంలో ప్రజల్ని ప్రభువుల్ని చెయాల్సిన రాజకీయం వారిని కేవలం ఓటర్లుగా వుంచింది. ఏక్‌దిన్‌కా సుల్తానులు గా మిగిల్చింది. ప్రజలు కేంద్రంగా సాగాల్సిన పాలనను ప్రజలకు దూరం చేసింది. దానికి ఒక కేంద్రీకృతమైన వికృత రూపం ఇచ్చింది. జవాబుదారీతనం గాని, పారదర్శకతగాని లేని తెరచాటు పాలన ప్రజల మీద రుద్దింది.

సేవకులుగా వుండాల్సిన పాలకులు ఈ రాజకీయం వల్ల ఎన్నికలు కాగానే ప్రభువులైపోతున్నారు. ప్రజల సొమ్ముతో నడుస్తున్న పాలనాయంత్రాంగం ప్రజల మీద పెత్తనం చేస్తున్నది.

ప్రజాస్వామ్యంలో ప్రభువులయిన ప్రజల్ని యాచకులను చేస్తున్న ఈ రాజకీయం కొనసాగవలసిందేనా ?

సేవకులే ప్రభువులుగా సాగించే పెత్తనం కొనసాగవలసిందేనా ?

### 2. వ్యాపారంగా రాజకీయం

ప్రస్తుత రాజకీయం దానిని ఒక వ్యాపారంగా మార్చివేసింది. ఎన్నికల్లో కోట్లు ఖర్చుపెట్టడం, అధికారాన్ని హస్తగతం చేసుకోవడం, తిరిగి ఏదో రూపంలో పెట్టిన పెట్టుబడికి పదిరెట్లు రాబట్టుకోవడం పరిపాటి అయింది.

చట్టసభలలో డబ్బులు తీసుకుని ప్రశ్నలు అడగడం దగ్గరనుండి, రాజధానులలో ఇళ్లస్థలాలు, ఇతర రాయితీలు పొందడం దగ్గరనుండి, నియోజకవర్గ అభివృద్ధి నిధులలో, పర్సంటేజీలు బొక్కడం దగ్గరనుండి, కాంట్రాక్టులు, టెండర్లలో వాటాలు మింగడం, ట్రాన్స్‌ఫర్లు, పోస్టింగులలో లంచాలు వసూలు చేసుకోవడం, అధికారాన్ని వినియోగించుకుని అడ్డదారుల్లో ఆస్తులు చేజిక్కించుకోవడం సర్వసాధారణం చేసింది. అధికారం పొందడానికి డబ్బు, తిరిగి దానిని పదిరెట్లు పెంపొందించడానికి అవినీతి - ఈ రెండు కలగలిసి కాపురం చేస్తున్నాయి. అక్రమ సంపాదన లేకుండా, అవినీతి లేకుండా రాజకీయ మనుగడ సాధ్యం కాని స్థితి కల్పించబడింది.

మొత్తం మీద రాజకీయ అధికారం ఒక బాధ్యతగా, సమాజసేవకు సాధనంగా కాకుండా పోయింది. రాజకీయం కుటుంబ ఆస్థిగా వ్యక్తిగత హోదాను పరువుప్రతిష్టలను పెంచే అంశంగా, లాభసాటి వ్యాపారంగా దిగజారింది.

ప్రస్తుత రాజకీయం సామాన్యులకు అందని ద్రాక్ష అయింది. ఆలోచనాపరులకు, మర్యాదస్తులకు జుగుప్స కలిగించేది అయింది. రాజకీయాలలో వారికి స్థానం కరువైంది. ఉత్తమ ప్రజాసేవకుల్ని ఈ రాజకీయం తన చట్రం బైటికి తోసివేసింది. ప్రస్తుతం అది దాదాపుగా అవినీతి పరులకీ, నేరచరితులకీ, వారసత్వ కుటుంబీకులకి రానురాను పరిమితం అవుతున్నది.

**అవినీతి లేకుండా రాజకీయం సాధ్యం కాని స్థితి కొనసాగవవలసిందేనా?**

**రాజకీయం కేవలం అవినీతిపరులకీ, అక్రమార్జనపరులకీ, నేరచరితులకీ వారసత్వ కుటుంబీకుల గుత్తసొమ్ముగా మిగిలిపోవలసిందేనా?**

**అవినీతికి మరో పార్శ్వంగా మారిన పాలనాయంత్రాంగం**

రాజకీయమే అవినీతికి కేంద్రమైనప్పుడు, ఇక పాలనాయంత్రాంగం మరోబాటలో నడవదు. ఆవు చేలో మేస్తే దూడగట్టున మెయ్యదు అన్న సామెత ఇక్కడ అతికినట్టు సరిపోతుంది.

ప్రజల సొమ్ముతో నడుస్తున్న పాలనాయంత్రాంగం, ప్రజలకు సేవకులుగా వ్యవహరించాల్సిన యంత్రాంగం అవినీతి రాజకీయాల అవసరాలను తీర్చేసాధనంగా మారింది. అధికార దుర్వినియోగానికి, అవినీతికి నిలయంగా పాలన సాగిస్తున్నది. ప్రజల దృష్టిలో అవినీతి తైలం లేకుండా కదలని యంత్రాంగం అయింది. ఇది రాజకీయంతో ముడిపడి ఘనీభవించిన సమస్య. రాజకీయంలో పుట్టిన ఈ అవినీతి, అభివృద్ధిని కబళించేస్థాయికి ఎదిగింది.

**జవాబుదారీతనం, పారదర్శకత లోపించి, అవినీతికి నిలయంగా మారిన పాలనాయంత్రాగం కొనసాగవలసిందేనా?**

**దీన్ని పెంచి పోషిస్తున్న రాజకీయం కొనసాగవలసిందేనా?**

## 3. మంట గలిసిన చట్టసభల గౌరవం

ప్రజాస్వామ్యంలో చట్టసభలు ప్రజలు అధికారానికి సాకార రూపాలు. ప్రజలు ఇచ్చిన అధికారాన్ని, సొమ్మునీ తిరిగి ప్రజలకు అందించే ప్రక్రియకు రూపం ఇచ్చేకేంద్రాలు. ఎంతో హుందాగా, గౌరవప్రతిష్టలతో సాగాల్సిన చట్టసభలు ఇప్పుడు అందరి దృష్టిలో నవ్వుల పాలవుతున్నాయి. అభివృద్ధి వ్యూహాలను చర్చించాల్సిన సభలో, చట్టాలను రూపొందించాల్సిన సభలో, ప్రజల సమస్యల పరిష్కారానికి వేదిక కావలసిన సభలో కొన్ని క్షణాలు కూడా సద్వినియోగం కాకపోవడం కంటే విషాదం మరొకటి వుండదు. చట్టసభలలో పరస్పర దూషణలు, ముష్టియుద్ధాలు నిరంతర ప్రక్రియ కావడం కంటే దారుణం మరొకటి వుండదు. చట్టసభల పట్ల ప్రజలు విశ్వాసం సన్నగిల్లితే జరిగే పరిణామాలపట్ల కించిత్తు కూడా ధ్యాస లేకుండా సాగుతున్న ఈ కిష్కింధకాండ ఇలా సాగవలసిందేనా?

**ప్రజలు ఇచ్చిన అధికారం ఇలా నగుబాటు కావలసిందేనా?**

**ప్రజాస్వామ్య వ్యవస్థల్ని నిర్వీర్యం చేస్తున్న ఈ రాజకీయం కొనసాగివలసిందేనా?**

చర్చలో పాల్గొనండి
మీ అభిప్రాయాలు
పంపండి

## 4. వికృతమైన కేంద్రీకృత పాలన

ప్రజాసామ్యంలో అధికారం ప్రజలది, సొమ్ము ప్రజలది. ప్రజలు కేంద్రంగా పరిపాలన సాగాలి. ప్రజలు గ్రామాలలో పట్టణాలలో నివసిస్తున్నారు. ఓటుకి జనహితానికి; పన్నుల సొమ్ముకి అందుకునే సేవలకి ; అధికారానికి జవాబుదారీతనానికి మధ్యగల సంబంధాన్ని ప్రజలకు స్పష్టంగా అర్థమయ్యే రీతిలో స్థానిక ప్రభుత్వాలు రూపుదిద్దుకోవాలి. పౌరులు కేంద్రంగా సాగాల్సిన వికేంద్రీకరణ మన దేశంలో తలకిందులు చేయబడింది. పాలన ప్రజలకి దూరం అయ్యింది. హైదరాబాద్ నుండి, ఢిల్లీ నుండి కేంద్రీకృత రూపంలో సాగుతున్నది. ముఖ్యమంత్రులూ, కలెక్టర్లు, పాలనాయంత్రాంగం, శాసన సభ్యుల చేతులలో అధికారం రానురాను బందీ అవుతున్నది.

ఈ కేంద్రీకృత పాలన వల్ల మంచి ప్రమాణాలు గల మంచినీరు, మరుగుదొడ్లు, పారిశుద్ధ్యం, విద్యా, వైద్య సేవలు ప్రజలకు దూరం అయ్యాయి. రాజ్యాంగ స్ఫూర్తికి అనుగుణంగా పంచాయితీలు, మున్సిపాలిటీలకు విధులు, నిధులు, సిబ్బంది బదలాయించాలి. వాటిని స్థానిక ప్రభుత్వాలుగా రూపొందించాలి. రాష్ట్ర బడ్జెట్‌లో జిల్లాల వారీగా కేటాయింపులు చేయాలి. రాష్ట్ర బడ్జెట్‌లో 40, 50 % నిధులు స్థానిక ప్రభుత్వాలు కేటాయించాలి. ఇవన్నీ జరినప్పుడే మన గ్రామాలు పట్టణాలు సర్వతోముఖాభివృద్ధికి నోచుకుంటాయి.

**ఇంకా ఢిల్లీనుండి, హైదరాబాద్‌నుండి కేంద్రీకృతమైన పాలన సాగాల్సిందేనా?**

**ఇంటిముందుప్రభుత్వం, కంటిముందు పాలన మన ప్రజలకు కలగా మిగిలిపోవలసిందేనా?**

చర్చాపత్రం

## 5. రాజకీయం పట్టించుకోవలసిన మౌలిక అవసరాలు : విద్య, ఆరోగ్యం

ప్రజలకు సుఖ జీవనాన్ని ఇచ్చే ఆరోగ్య, వైద్య సేవలు - విద్యారంగాలు ఎలాంటి దుస్థితిలో వున్నాయో అందరికీ తెలిసిందే. ఈ రెండు వ్యవస్థలు పూర్తిగా ప్రజల విశ్వసనీయతని కోల్పోయాయి. పాఠశాల విద్య నుండి యూనివర్శిటీల వరకు విద్యా వ్యవస్థ పూర్తిగా భ్రష్టుపట్టింది. బీదరికంలో మ్రగ్గిపోతున్న కుటుంబాలు కూడా పిల్లలు బాగుపడుతారేమేననే ఆశతో వేలకు వేలు ఖర్చుపెట్టి 'కాన్వెంటు' స్కూళ్లకి పంపుతున్నారు. అయినా అత్యధికుల భవిష్యత్తు అగమ్యగోచరమవుతున్నది. పనికిమాలిన సరిఫికెట్లు, డిగ్రీలు, ఉత్తీర్ణతా శాతాలు తప్ప అవి యువతరాన్ని ప్రయోజకులుగా, తమ కాళ్లమీద తాము నిలబడేవారుగా తీర్చే సాధనాలు కాకుండాపోయాయి. సమాజ అవసరాలకీ మన చదువుకీ మధ్య సంబంధం పూర్తిగా తెగిపోయింది. చివరికి సాంకేతిక, వృత్తి విద్యలలో కూడా ప్రమాణాలు కరువయ్యాయి. అలాగే ప్రాథమిక ఆరోగ్య, వైద్య సేవల పరిస్థితి అధ్వాన్నంగా వుంది. సామాన్య ప్రజలు అనారోగ్యానికి గురైతే తాము ఏమౌతామో, తమ కుటుంబాల భవిష్యత్తు ఏమౌతుందోనన్న భయాందోళనలకు గురౌతున్నారు. ఒక్కసారి ఆసుపత్రి పాలయిన రోగి కుటుంబం సగటున సంవత్సరాదాయంలో 60 శాతం వెచ్చించాల్సి వస్తోంది. ఖర్చుల పర్యవసానంగా రోగులలో 40 శాతం మంది ఆసుపత్రి ఖర్చుల కోసం అయితే ఆస్తులని అమ్ముకుంటున్నారు. లేదా హెచ్చు వడ్డీలకి అప్పులు తెస్తున్నారు. దాంతో ఆసుపత్రుల్లో పడక వేసే రోగులలో 25 శాతం మంది కేవలం ఆసుపత్రి ఖర్చులవల్ల బీదరికంలోకి కూరుకుపోతున్నారు.

ఇలా కేవలం పుట్టుక కారణంగా కోట్లాది మంది బిడ్డల శక్తి సామర్థ్యాలు వికసించే అవకాశం లేకుండా పోతోంది. కేవలం బీదరికం కారణంగా లక్షలాది కుటుంబాలు నివారించదగ్గ క్లేశానికి గురౌతున్నారు, ఎందరో అకాల మృత్యువు బారిన పడుతున్నారు. సరయిన విద్య, ఆరోగ్యం అందక పోవటంతో ఎదిగే అవకాశాలు అధిక సంఖ్యాకులకి కొరవడుతున్నాయి.

**విద్య, ఆరోగ్య రంగాలలో ఇలాంటి దుస్థితిని తొలగించాల్సిన అవసరం లేదా?**
**దీనిని పట్టించుకోని రాజకీయాన్ని వదిలించుకోనక్కరలేదా?**

## 6. దళితులు, మహిళలు, బలహీనవర్గాలు

దళితులూ, మహిళలు, బలహీనవర్గాలు ప్రధానంగా పుట్టుకతో తరతమ బేధాలతో వివక్షతకు గురవుతున్నాయి. కుల, మతాలని అంతరాలని ఒక్క కలం పోటుతో ఎవరూ తొలగించలేకపోయినా నిస్సందేహంగా వారి సామాజిక హోదాని పెంచవచ్చును. రాజకీయ హోదాని పెంచవచ్చును. పేదల కుటుంబాలన్నిటికి ఇల్లు, కొంత భూ వసతి లేదా ఏదో ఒక స్థిరమైన ఆదాయవనరుల మీద యాజమాన్యం కల్పించడం ద్వారా వారి ఆర్థిక స్థితిగతులనూ, జీవన నాణ్యతనీ పెంచవచ్చును. వారు సమాజంలోతలెత్తుకుని ఆత్మ గౌరవంతో తిరిగే పరిస్థితి కల్పించవచ్చును. రిజర్వేషన్లు కొంత మేరకు ఉపశమనాన్ని కల్గిస్తున్నా అవి మాత్రమే సర్వరోగ నివారిణి కాదు. ఈ తరగతుల ప్రజలు తమ సొంత కాళ్లమీద ఆర్థికంగా, సామాజికంగా,

రాజకీయంగా నిలబడగల స్థితిని కల్పించి తీరాలి.

రాజకీయం యీ పనిని పక్కన పెట్టి ఈ అంతరాలను, యీ వివక్షతను తన స్వప్రయోజనాలకి పనికొచ్చే ఓటు బ్యాంకులుగా మలుచుకోడానికి ప్రయత్నించడం కంటే దారుణం మరొకటి వుండదు.

పుట్టిన ప్రతిబిడ్డకీ కులం, మతం, లింగవివక్షతలకి తావు లేకుండా తన ప్రతిభాపాటవాలు వికసింపజేసుకోవడానికి ఉన్నత ప్రమాణాలు గల విద్యను అందించే బాధ్యత రాజకీయం తీసుకోవాలి.

ప్రజలందరికీ కులం, మతం, పేదరికం వివక్షతలు లేకుండా అందరికీ నివారించదగిన రోగాల బారినుండి ఆరోగ్య వైద్య సేవలు అందించే బాధ్యత రాజకీయం తీసుకోవాలి.

సామాజికంగా ఏదోరూపం లో వివక్షతకు గురౌతున్న ఈ తరగతులకి రాజకీయరంగంలో సముచిత ప్రాతినిధ్యాన్ని కల్పించడం రాజకీయం బాధ్యత కావాలి.

సమాజ అవసరం కోసం చేసే ప్రతి వృత్తి గౌరవ ప్రదమైనదేనన్న భావన ప్రజలలో కలిగేలా అన్ని వృత్తులకు గౌరవాన్ని కల్పించే చర్యలు తీసుకోవాలి.

**పుట్టుకతో వస్తున్న వివక్షతలు తొలగించే బాధ్యతలు స్వీకరించడం ప్రస్తుత రాజకీయానికి కర్తవ్యంగా కనిపించడం లేదు. అయినా ఇలాంటి రాజకీయం కొనసాగవలసిందేనా? ఈ వివక్షత ఇలా సాగిపోవల్సిందేనా?**

### 7. గిట్టుబాటు నుండి లాభసాటికి వ్యవసాయరంగాన్ని మార్చాలి.

వ్యవసాయ విస్తరణకు సాగునీటి ప్రాజెక్టులు, ఇతర మౌలిక సదుపాయాల కల్పన అవసరం. కాని వీటితోనే వ్యవసాయరంగం సమస్యలు పరిష్కారం కావు. ప్రస్తుతం వ్యవసాయం చాలా మంది రైతులకు గిట్టుబాటు కావడమే సమస్యగా వుంది. వ్యవసాయాన్ని లాభసాటి రంగం చెయ్యాలి. అప్పుడు మాత్రమే రైతుల స్థితిగతులు, గ్రామీణార్థికాభివృద్ధి స్థితిగతులు మారతాయి. దీనికి వ్యవసాయంలో ఉత్పాదకత పెంచాలి. ఈ ఉత్పత్తులకు అదనపు విలువ కల్పించాలి. రైతులు తమ ఉత్పత్తులు నిల్వ చేసుకునే సామర్థ్యం పెంచాలి. వ్యవసాయంతో పాటు అనుబంధ పంటలు, పరిశ్రమలు అందులో భాగం కావాలి.

### 8. సమతూకమైన పారిశ్రామికాభివృద్ధి

సత్వర అభివృద్ధిని సాధించడానికి ఉత్పత్తి ప్రధానమైన పారిశ్రామికీకరణ మీద దృష్టి పెట్టాలి. అందుబాటులో వున్న మానవ వనరులు, ప్రకృతి వనరుల వినియోగం ప్రాతిపదికపై పారిశ్రామికీకరణ వ్యూహాలను రాజకీయం రూపొందించాలి. రాష్ట్రమంతటా వివిధ స్థాయిలలో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత నివ్వాలి. స్వయం ఉపాధి, చిన్న పరిశ్రమలు, గ్రామీణ నిరుద్యోగుల ఉపాధినీ, సమన్వయం చేసే పారిశ్రామిక విధానాన్ని రాజకీయం రూపకల్పన చెయ్యాలి.

**కానీ, మన రాజకీయానికి ఉన్నది ఒకటే అభివృద్ధి వ్యూహంగా కనిపిస్తున్నది. ఏ పని తలపెట్టినా తిరిగొచ్చే సొమ్ము ఎవరికి ఎంత అన్నదే గీటురాయి అవుతున్నది.**

**ఇలా అభివృద్ధిని కబళించే అవినీతి రాజకీయం కొనసాగాల్సిందేనా?**

**చర్చలో పాల్గొనండి**
**మీ అభిప్రాయాలు పంపండి**

### 9 . విద్యార్థులు - యువతరం భవిష్యత్తు

యువతరం శక్తి సామర్థ్యాలను పూర్తిగా వికసింప జెయ్యడంలో, వినియోగించుకోవడంలో మనదేశం విఫలం అయింది. దీనికి రాజకీయం బాధ్యత వహించి తీరాలి.

చదువుకునే అవకాశం వున్నప్పటికీ, వారిలో కొద్దిమందిని తప్ప అందరినీ ప్రయోజకులుగా, పోటీకి నిలబడగలవారుగా చేయగల విద్యా వ్యవస్థను రూపొందించలేక పోయింది.

కొద్దో గొప్పో చదివి విరమించుకున్న వారికి ఎలాంటి నైపుణ్యాలు అందకపోవడం వల్ల వారు కుటుంబాలకు భారంగా తయారవుతున్నారు. లేదా ఏవో వ్యసనాలకు బానిసలై చాలామంది నిష్ప్రయోజకులుగా మిగులుతున్నారు. చదువుకు దూరమై బాలకార్మికులుగా, తర్వాత రెక్కల కష్టంమీద మాత్రమే బతకగల వారికి ఎలాంటి ఎదిగే అవకాశాలు లేకుండా చేసింది. చదువును యువతరం శక్తిసామర్థ్యాలను పెంచేదిగా, సమాజ అవసరాలను తీర్చేదిగా సంస్కరించాలి. పట్టణ, గ్రామీణ ప్రాంతాలలో ప్రజలకు అవసరమైన సేవలను గుర్తించి అందుకు తగిన వృత్తినైపుణ్యాలను యువతకు అందించాలి. పరిశ్రమల, కర్మాగారాల

అవసరాలకు స్థానిక సాంకేతిక విద్యాసంస్థల్ని అనుసంధానించి, యువతకు ఉపాధి అవకాశాలు పెంపొందించాలి. గ్రామీణ ఉత్పత్తులకు అదనపు విలువని, అదనపు సంపదని సృష్టించే అంశాలను గుర్తించి యువత ఉపాధి అవకాశాలను మెరుగుపర్చాలి.

**సరైన పరిష్కారాలు ఆలోచించకుండా యువతరం భవిష్యత్తును చిదిమి వేస్తున్న ప్రస్తుత రాజకీయం కొనసాగాల్సిందేనా?**

**యువతరం భవిష్యత్తు అణగారి పోవాల్సిందేనా?**

### 10. మద్యం అమ్మకాలే ఆదాయమార్గాలా?

మనలాంటి వెనుకబడిన దేశాలలో మద్యపానం అన్నది కేవలం వ్యక్తిగత అంశం మాత్రమే కాదు. అదొక సామాజిక సమస్య. అది పేదల జీవితాలను నాశనం చేస్తున్నది. కుటుంబాలను ఛిద్రం చేస్తున్నది. సామాజిక నేరాలకు, సంఘర్షణలకు కారణం అవుతున్నది. అందుచేత ఈ సమస్యకు ఆచరణయోగ్యమైన పరిష్కారాన్ని రాజకీయం కనుగొని తీరాలి. దీనికి మద్యనిషేధం మార్గం కాదని దాదాపు అందరూ అంగీకరిస్తారు. ఎందుకంటే అది సాధించే ప్రయోజనాల కంటే అనర్థాలు ఎక్కువగా వున్నాయన్నది గత అనుభవాలు రుజువు చేస్తున్నాయి. కాని దీనిని అసరాగా చేసుకుని రాజకీయం మద్యం వ్యాపారాన్ని ప్రభుత్వ ఆదాయ మార్గంగా భావించడం, ఎంత ఎక్కువ మద్యం అమ్మితే అంత ఎక్కువ ఆదాయం వస్తుందన్నది లక్ష్యం కావడం, అందుకోసం చేస్తున్న ప్రయత్నాలు క్షమించరాని నేరం తప్ప మరొకటి కాదు.

**మద్యాన్ని ఆదాయమార్గంగా భావించే రాజకీయం ఇంకెన్నాళ్లు ?**

**ఈ రాజకీయానికి పేదల బతుకులు ఛిద్రం కావాల్సిందేనా ?**

**చర్చాపత్రం**

### 11. శాంతిభద్రతలు - సత్వరన్యాయం

మన సమాజంలో శాంతిభద్రతలు క్షీణిస్తున్నాయి. దీనికి కారణమైన మౌలిక అంశాల మీద రాజకీయం దృష్టి పెట్టడం లేదు.

ప్రజలకు నిత్యజీవితంలో ఎదురయ్యే చిన్న చిన్న సమస్యలకు, తగువులకు, వివాదాలకు సత్వర పరిష్కారాలు చూపగల వ్యవస్థలను రూపొందించడం మీద రాజకీయం శ్రద్ధ పెట్టలేదు. ఇందుకోసం పుట్టుకొచ్చిన దాదాలు, మాఫియాలుగా రూపాంతరం చెందుతున్నారు.

ప్రజాస్వామ్య పద్ధతులలో పరిష్కారాలు కరువైనప్పుడు ప్రజలు పార్లమెంటరీ యేతర పద్ధతులను సమర్థిస్తారు. జన జీవనాన్ని అతలాకుతలం చేసే ఆందోళనలూ, ఉద్యమాలు అంతిమంగా ఉగ్రవాద చర్యల సమర్థనకు ఇది దారితీస్తుంది. ఈ ధన రాజకీయం చాలామందిలో నిరాశని, ద్వేషాన్ని నింపి హింసకి పురికొల్పుతున్నది. హింస వల్ల అరాచకత్వం వస్తుందని భయపడే వర్గాలు శాంతి భద్రతల పరిరక్షణ కోసం ఎలాంటి అణిచివేతనయినా ప్రోత్సహిస్తున్నాయి. ఇలా అరాచకత్వం, అణిచివేతల మధ్య సమాజం నలిగిపోతుంది. దీనికి తోడు నేర పరిశోధన, రాజకీయం పెనవేసుకుంటే ప్రత్యర్థుల మీద దాడులు నిత్యకృత్యాలవుతాయి. నేరచరితులు రాజకీయం లో చొరబడి అధికారాన్ని, పోలీసు యంత్రాంగాన్ని తమ స్వార్థప్రయోజనాలకు వినియోగించు కుంటున్నారు.

**ఈ పరిస్థితులన్నీ శాంతిభద్రతల్ని క్షీణింపజేస్తాయి. ఈ పద్ధతి కొనసాగాల్సిందేనా?**

**దీనిని పరిష్కరించాల్సిన రాజకీయం ఇందులో భాగమైతే అలాంటి నేరపూరిత రాజకీయం కొనసాగాల్సిందేనా?**

## III . నూతన రాజకీయ సంస్కృతి ఆవశ్యకత

### 1. మార్పు సాధ్యమేనా?

ప్రస్తుత రాజకీయం కుళ్లిపోయిందనీ, అవినీతికీ నేరచరితకీ తావు అయిందని, అదొక అధికార క్రీడగా, వ్యాపారంగా మారిందని అందరూ అంగీకరిస్తారు. చివరికి రాజకీయాలలో క్రియాశీలంగా వున్న కొందరు కూడా దీనిని కాదనడం లేదు. దీనిని మార్చవలసిన అవసరం వుందని అందరూ బల్లగుద్ది మరీ వాదిస్తారు. పోతే దీనిని మార్చగలమా అన్నది చాలా మందిని వేధిస్తున్న సమస్య. ఎందుకంటే రాజకీయం నానాటికీ దిగజారుతున్నదనీ, ప్రజలు నానాటికీ ప్రలోభాలకు లోనౌతున్నారేగాని మార్పుకు సిద్ధమౌతున్న ఛాయలు కనిపించడం లేదనీ చాలామంది భావిస్తున్నారు. అందుచేత ఎవరికి వారు ఈ రాజకీయాలకి దూరంగా వుండడమే మంచిదని తలపోస్తున్నారు. ఇవన్నీ కళ్లముందు కనిపిస్తున్న అంశాలైనందువల్ల నిరాశకీ, నిస్పృహకీ గురౌతున్నారు.

మార్పుకోరే ప్రయత్నాల పట్ల పెదవి విరుస్తున్నారు. అందుచేత మనం ఈ అంశాలను కొంత లోతుగా విశ్లేషణ చేసుకోవాలి.

మానవ చరిత్ర ఎప్పుడూ ముందుకే నడుస్తుంది. ఈ నడకలో కొన్ని తాత్కాలికమైన ఆటుపోట్లు, అవరోధాలు, వెనుకడుగులు వుంటాయి. వాటిని చూసి ఎవరూ బెంబేలు పడకూడదు. నిరాశానిస్పృహలకు లోనుకాకూడదు. మనదేశంలో ఇంత చెడిపోయిందనుకున్న రాజకీయం కూడా దేశాన్ని ఇంతవరకూ ముందుకే నడిపించింది. అయితే నడవాల్సినంత వేగంగా నడవలేదు. సాధించాల్సిన అభివృద్ధి సాధించలేదు. అలాగే ప్రజలు మార్పుకోసం అనేక ప్రయత్నాలు చేశారు. చాలా విజయాలు సాధించారు. ఇవన్నీ మనం కాదనలేని సత్యాలు. మనదేశం మన రాష్ట్రం స్వాతంత్ర్యానికి పూర్వంకంటే ఇప్పుడు నిస్సందేహంగా అభివృద్ధి చెందాయి. మన చదువు, మన ఆరోగ్యం, మన ప్రజల సంపాదనాశక్తి నిస్సందేహంగా పెరిగాయి. కాని ఈనాటి ఆధునిక ప్రపంచ విజయాల స్థాయికి సరితూగేవిగా లేవు. ఈనాటి సాంకేతి కాభివృద్ధికి అనుగుణంగా లేవు. ఈ అగాధాన్ని పూడ్చాల్సిన రాజకీయం అలాంటి పని ఎందుకు చెయ్యలేక పోతున్నది? ఇలాంటి మార్పుని ప్రజలు ఆహ్వానించడం లేదా? లేక వారికి అలాంటి మార్పు సాధించే అవకాశాలు అందుబాటులో లేకుండా పోయాయా? ఇవీ మనం ఆలోచించాల్సిన అంశాలు. ఇందుకు మనదేశంలో జరిగిన రాజకీయం పరిణామాలను మనం అర్థం చేసుకోవాలి. వాటి ఆధారంగా ఈ సమస్యలకు పరిష్కారాన్ని అన్వేషించాలి.

**చర్చలో పాల్గొనండి**
**మీ అభిప్రాయాలు పంపండి**

## 2. రాజకీయ వ్యవస్థలో పరిణామాలు

**మొదటి దశ :**

1947 నుండి 1967 వరకు దేశంలో రాష్ట్రాలలో దాదాపుగా ఏకపార్టీ అధిపత్యం కొనసాగిన దశ ఈ తొలిదశ ప్రథమార్థంలో స్వాతంత్రోద్యమ స్ఫూర్తికి కొనసాగింపుగా పలు ప్రజాస్వామ్య సంస్థలు రూపుదిద్దుకున్నాయి. ఉత్తమ విలువలు గల రాజ్యాంగం, స్వతంత్ర ప్రతిపత్తి గల న్యాయవ్యవస్థ, ఎన్నికల నిర్వహణా వ్యవస్థ, పార్లమెంటరీ సంస్థలు, పత్రికాస్వేచ్ఛ వగైరాలన్నీ ఆనాటి రాజకీయం సాధించిన విజయాలు. ఎన్ని లోపాలున్నా వ్యవసాయాభివృద్ధికీ, పారిశ్రామికాభివృద్ధికీ ఈ దశలో గట్టి పునాదులు ఏర్పడ్డాయి.

కాని ప్రజాస్వామ్యంలో ఏకపార్టీ గుత్తాధిపత్యం తెచ్చే అనర్థాలు పెరుగుతూ వచ్చాయి. అవినీతి, అధికార దుర్వినియోగం, జాతీయస్థాయిలోనే కేంద్రీకృతమైపోయిన పాలన రాను రాను ప్రజల అసంతృప్తికి కారణాలయ్యాయి. 1967 లో 9 రాష్ట్రాలలో ప్రజలు ఈ ఏకపార్టీ గుత్తాధిపత్యానికి వ్యతిరేకంగా తీర్పు చెప్పారు. ప్రజాస్వామ్యంలో బహుళపార్టీల పోటీకి, అధికారానికి మార్గం వేశారు.

**రెండవ దశ :**

ఇది మనదేశ రాజకీయాలలో చాలా సంక్లిష్టమైన దశ

ఈ దశలో రాజకీయానికి దేశం ఒక ప్రయోగశాల అయింది. 1967 లో వివిధ రాష్ట్రాలలో ఏకపార్టీ గుత్తాధిపత్యం బద్దలుకావడంతో అధికారం కోసం రాజకీయ సంఘర్షణ తీవ్రతరం అయింది. జాతీయస్థాయిలో ప్రత్యామ్నాయాన్ని నిరోధించడానికి 1975లో ఎమర్జెన్సీ విధించబడింది. ప్రజాస్వామ్యానికి ముప్పు ఏర్పడినా ఆ ఎమర్జెన్సీయే దేశంలో ప్రత్యామ్నాయాన్ని రూపొందించడానికి సాధనం అయింది. 1977లో జాతీయస్థాయిలో ఏకపార్టీ ఆధిపత్యం తొలగిపోయింది. ప్రజాస్వామ్యం పునరుద్దరణతో పాటు అది మరింత బలపడింది, స్థిరపడింది.

జాతీయ స్థాయిలో, చాలా రాష్ట్రాలలో ఒకేసారి ఏకపార్టీ ఆధిపత్యం బద్దలు కావడంతో అటు జాతీయస్థాయిలలో, ఇటు రాష్ట్రాలలో కొత్త పార్టీలు పుట్టుకొచ్చాయి. వివిధస్థాయిలలో అధికారాన్ని పొందడానికి అందివచ్చిన ప్రతి అవకాశాన్ని రాజకీయం వినియోగించుకుంది. ఈ పరిస్థితులలో మతం, కులం, ప్రాంతం అన్నీ రాజకీయంలో పాత్రధారులయ్యాయి. కొన్ని రాష్ట్రాలలో ప్రాంతీయ పార్టీలు ఏర్పడి స్థిరపడ్డాయి. కొన్ని రాష్ట్రాలలో కులం ప్రాతిపదికన పార్టీలు రూపుదిద్దుకున్నాయి. జాతీయ, రాష్ట్ర స్థాయిలలో కొన్ని పార్టీలు బలపడడానికి మతం దోహదపడింది. ఇవన్నీ భావోద్రేక సమస్యలుగా కనిపించినా మనం పట్టించుకోని సామాజిక సమస్యలు, మనం తెచ్చిపెట్టుకున్న కేంద్రీకృత పాలన నుండి ఉత్పన్నమైన సమస్యలు. ఈ కాలంలో మన ప్రజాస్వామ్యం ఈ ఆటుపోట్లకు తట్టుకునే పరిణతి దిశగా పయనించింది. అలాగే ఆర్థికరంగంలో కూడా పెనుమార్పులు సంభవించాయి. దేశం నూతన సంస్కరణల యుగంలోకి ప్రవేశించింది.

దేశంలో ప్రజాస్వామ్య స్ఫూర్తి విస్తరించడం, ఫెడరల్ స్ఫూర్తి బలపడడం, రాష్ట్రాల పాత్ర గణనీయంగా పెరగడం, సామాజిక సమస్యలు రాజకీయంలో పాత్రధారులుకావడం, ఆర్థికరంగంలో సంస్కరణల ప్రారంభం - ఇవన్నీ రాజకీయం సాధించిన విజయాలే. కాని ఇన్ని విజయాలు సాధించిన రాజకీయ రంగమే ఇప్పుడు సమస్య అయింది. ఒకసంధి కాలంలోకి దేశాన్ని నెట్టింది. దీనిని ఎలా పరిష్కరించాలన్నదే మనముందున్న ప్రస్తుత సమస్య.

**చర్చాపత్రం**

### సంధిదశలో రాజకీయ వ్యవస్థ

- ఏకపార్టీ ఆధిపత్యదశ అంతరించడంతో దేశంలో పలుపార్టీలు పుట్టుకొచ్చాయి.
- ఇందులో భాగంగా ప్రాంతీయ పార్టీలు, కుల, మతాల ప్రాతిపదికన గల పార్టీలు ఏర్పడ్డాయి. ప్రజలలో అలాంటి భావోద్రేకాలు చల్లబడగానే ఈ తరహా పార్టీలు కూడా తమ పాత నినాదాలను అడపాదడపా వినియోగించుకుంటూనే, సంప్రదాయ పార్టీల పద్ధతులనే అనుసరించడం మొదలు పెట్టాయి.
- బహుళపార్టీల ఏర్పాటుతో రాజకీయ రంగంలో పోటీ తీవ్రతరం అయింది. అధికారం పొందడానికి, అందులో భాగం పంచుకోడానికి చిన్న, పెద్ద పార్టీలు జాతీయస్థాయిలో రాష్ట్రాలస్థాయిలో వివిధకూటములుగా ఏర్పడుతున్నాయి. ఈ క్రమంలో దేశంలోని అన్ని పార్టీలూ ఎప్పుడో ఎక్కడో ఒకచోట అధికారంలో పాలుపంచుకుంటున్నాయి. ఇప్పుడు దేశంలో దాదాపు అన్ని పార్టీలు అధికారం పొందిన పార్టీలే కావడం విశేషం.

### 3. పెడ మార్గం పట్టిన రాజకీయం

రాజకీయ రంగంలో బహుళ పార్టీల ప్రవేశంతో రాజకీయపరమైన పోటీ పెరిగింది. అధికారాన్ని అందిపుచ్చుకునే అవకాశాలు అన్ని పార్టీలకు వస్తున్నాయి. ఇవన్నీ రాజకీయరంగంలో మంచి పరిణామాలకు, ఆరోగ్యపరమైన పోటీకి, ప్రజల సమస్యల పరిష్కారానికి కొత్త ప్రత్యామ్నాయాల రూపకల్పనకు దారితియ్యాలి. కానీ, మనదేశంలో రాజకీయం ఇలాంటి ఉత్తమ పద్ధతులకు దిగకుండా దానిని భ్రష్టు పట్టించింది. ఇదే ఈ కాలంలో జరిగిన గొప్ప రాజకీయ విషాదం.

- బహుళ పార్టీల వల్ల ప్రజలు ముందుకు బహుళ ప్రత్యామ్నాయాలు రావాలి, ప్రజలకు ఎంచుకునే అవకాశాలు పెరగాలి. మనదేశంలో ఇలాంటి మంచి పద్ధతులు రావడానికి బదులు రాజకీయం కేవలం అధికార క్రీడకే పరిమితం అయింది. అధికారాన్ని అందుకోవడమే ఏకైకలక్ష్యం కావడంతో రాజకీయం అన్ని వక్రమార్గాలను ప్రయోగించే హీన సంస్కృతిలోకి దిగజారింది.
- బహుళ పార్టీల వల్ల రాజకీయ రంగంలో వచ్చిన పోటీ మంచిమార్గంలో సాగివుంటే రాజకీయ పార్టీలు తమ పునాదినీ ప్రభావాలనీ పెంచుకోడానికి ప్రజల చుట్టూ, ప్రజ సమస్యల చుట్టూ తిరిగి ఉండేవి. ప్రజల్ని ప్రభువుల్ని చెయ్యడంలో పోటీపడాల్సిన రాజకీయం కేవలం అధికార క్రీడగా దిగజారడంతో ప్రజలు కేవలం ఓటర్లుగా భావించబడుతున్నారు. అందువల్ల ఓట్లు పొందే జనాకర్షణ పథకాలకు, రాజకీయం ప్రధానంగా పరిమితం అయింది. అధికారం పొందడమే ఏకైక లక్ష్యంగా, పోలింగ్ నాడు ఓట్లు కొనుగోలుకీ, సారాయి పంపిణీకి, దొంగఓట్లకీ, రిగ్గింగులకీ ప్రాధాన్యత పెరిగింది. ఇటీవల తమిళనాడు ఎన్నికలు ఈ క్రమానికి పరాకాష్టగా వుంది. అధికారం పొందడానికి పె వక్రమార్గాలతో పాటు ప్రభుత్వ సొమ్ముతో ఓటర్లను నేరుగా కొనుగోలు చేసే పద్ధతులు ప్రారంభం అయ్యాయి.
- దేశంలో అన్ని పార్టీలు ఏదో ఒక కూటమిలో చేరి అధికారంలో పాలుపంచుకుంటున్నాయి. దీంతో అధికార క్రీడ ఒక జాడ్యంగా ప్రధాన పార్టీలనే కాకుండా అన్ని పార్టీలనూ ఆవహించింది. అధికారంలో వాటాకోసం గెలుపు, గెలుపుకోసం వక్రమార్గాలు మొత్తం రాజకీయ వ్యవస్థని కలుషితం చేశాయి. ఇలా అన్ని పార్టీలు ఈ విషవలయంలో భాగం అయ్యాయి. క్షీణ సంస్కృతిలో మునిగితేలుతున్నాయి. ప్రస్తుతం రాజకీయపార్టీల మధ్య తేడా కేవలం నాయకులు, జెండాలలో తప్ప దాదాపు అన్నీ ఒకే సంస్కృతి తో వ్యవహరిస్తున్నాయి.

  ఈ విషవలయం నుండి బైటపడే ప్రయత్నాలు చెయ్యకపోగా రానురాను అవి ఈ ఊబిలో మరింతగా కూరుకు పోతున్నాయి. వాటికి స్వయందిద్దుబాటుకు ఎలాంటి ఏర్పాటు లేదు. కొత్త దారీ చూపించగల శక్తీ లేదు. ఈ సంధిదశని అధిగమించడం వాటికి సాధ్యం కావడం లేదు.

### 4. ప్రజలకు ప్రత్యామ్నాయం లేదు

చర్చలో పాల్గొనండి
మీ అభిప్రాయాలు పంపండి

రాజకీయ వ్యవస్థలో నెలకొన్న ఈ సంధిదశ, ప్రజలకు మరో ప్రత్యామ్నాయం లేకుండా చేసింది.

గతంలో ఏకపార్టీ ఆధిపత్యాన్ని వదిలించుకోవాలనుకున్నప్పుడు, ప్రజల ముందు ఏకపార్టీ ఆధిపత్యాన్ని సవాలు చేసే పార్టీ లేదా పార్టీలు వున్నాయి. ప్రజలు మార్పుకు సాధనాలుగా అలాంటి పార్టీలను వినియోగించుకోగలిగారు.

అలాగే ప్రజలలో ప్రాంతీయ ఆకాంక్షలు బలంగా వ్యక్తమైనపుడు ఆ ఆకాంక్షలను ప్రతిబింబించే పార్టీలు ఉంటే వాటిని గెలిపించారు. లేదా కొత్తగా అలాంటి పార్టీలు పుట్టుకొచ్చినా వాటినీ ఆదరించారు. మార్పుకి సాధనంగా ప్రజలు అలాంటి పార్టీలను వినియోగించుకున్నారు.

కానీ ప్రస్తుత సంధిదశలో ప్రజల ముందు దేశంలోనూ, రాష్ట్రంలోనూ రెండేసి పార్టీలు లేదా కూటములు ప్రధానంగా వున్నాయి. అవి కేవలం అధికార క్రీడగా మాత్రమే రాజకీయాన్ని నెరపుతున్నాయి. ఈ పక్షాలు ఎన్ని జనాకర్షణ పథకాలు ప్రవేశ పెట్టినా , డబ్బు ఎంత విరజిమ్మినా, ఎన్ని ప్రలోభాలు పెడుతున్నా, ప్రజలు మార్పుకోసం ఆరాటపడుతూఽ వున్నారు. అధికారంలో వున్న పార్టీలను గద్దె దించుతున్నారు. కొత్త వాళ్లని ఎక్కిస్తున్నారు. వారిని మళ్లీ దించుతున్నారు. ఎందుకంటే ప్రజలు ఆట మార్చాలని ఇలాంటి ప్రయత్నాలు చేస్తున్నారు. కాని జరుగుతున్నది, "ఆటగాళ్లు మారుతున్నారు గాని ఆట తీరు మారడం లేదు". ఇలా ఎన్నిసార్లు ఆటగాళ్ళని మార్చినా ప్రజలు పెనంమీద నుండి పొయ్యిలోకి, పొయ్యిలో నుండి పెనం మీదకీ మారడం తప్ప వారి జీవితాలలో ఆశించిన మార్పు రావడం లేదు. ప్రజలకు ఆటగాళ్ళను మార్చడం తప్ప మరో మార్గం లేకుండా పోయింది. ఎందుకంటే ప్రజల ముందు ఆటను మార్చే పార్టీలు లేవు. ప్రజలు తమంతట తాము ప్రత్యామ్నాయ పార్టీలను సృష్టించుకోలేరు. అలాంటి ప్రత్యామ్నాయం వుంటే మార్పుకి సాధనంగా దానిని వినియోగించుకుంటారు. అది రానంతకాలం ఆటగాళ్లను మార్చడం తప్ప ప్రజలకు మరో మార్గం ఉండదు.

పార్టీలు రాజకీయ అధికార క్రీడలో మునిగిపోవడం, ప్రజలు తమంతట తాము ప్రత్యామ్నాయాన్ని రూపొందించుకోలేని స్థితి - ఇవీ ఈ సంధియుగం మనముందుంచిన సవాళ్లు.

ఈ సవాళ్లను అధిగమించేందుకు మరొక పార్టీని రూపొందించి, దానిని కూడా అధికార క్రీడలో భాగస్వామిని చేయడం పరిష్కారం కాదు. కొత్త తరానికి కొత్త రాజకీయాన్ని సృష్టించాలి. ఒక కొత్తరకం ప్రత్యామ్నాయాన్ని రూపొందించాలి. రాజకీయాలకి వున్న నిజమైన అర్థం ప్రాతిపదికగా ఒక నూతన రాజకీయ సంస్కృతిని సంతరించుకున్న ప్రతామ్నాయం తప్ప మరేదీ ఈ సంధియుగం సమస్యకు పరిష్కారం కాదు. ప్రజల ముందుకు అలాంటి ప్రత్యామ్నాయం వస్తే , దానిని మార్పుకు సాధనంగా వినియోగించుకునే అనుభవం ప్రజలకు వుందని గత చరిత్ర రుజువు చేస్తున్నది.

ఇలాంటి ప్రత్యేక తరహా పార్టీని, కొత్త రాజకీయ సంస్కృతికి పునాదిగా వుండే పార్టీని, ప్రజల ఆకాంక్షలకు ప్రతిరూపంగా వుండే ప్రత్యామ్నాయాన్ని రూపొందించడం ఒక చారిత్రక అవసరం. అదొక్కటి మాత్రమే ఈ సంధి యుగం నుండి రాజకీయ వ్యవస్థను బయట పడేస్తుంది. సమాజహితం కోసం కార్యకలాపాలు నిర్వహించే సాధనంగా తిరిగి రాజకీయాన్ని మార్చగలుగుతుంది.

ఆ ప్రత్యామ్నాయం ఎలాంటి రాజకీయం మీద ఆధారపడాలి, ఎలాంటి సంస్కృతికి ప్రాతినిధ్యం వహించాలి?

## IV . కొత్త రాజకీయ సంస్కృతిని సాధించడం ఎలా?

### 1. మంచి రాజకీయం ఆధారంగా నూతన ప్రత్యామ్నాయం

ప్రస్తుత రాజకీయాన్ని నిరసించడం అంటే మొత్తం రాజకీయాలనే ద్వేషించడం కాకూడదు. రాజకీయాలకు దూరంగా వుండటం కాకూడదు. నకిలీ రాజకీయాలను వదిలించుకోవడం ఎంత అవసరమో మంచి రాజకీయాన్ని, నూతన రాజకీయ సంస్కృతిని ఆహ్వానించడం అంతకంటే ముఖ్యం. ఎందుకంటే సమాజానికి, ప్రజాస్వామ్యానికి రాజకీయాలు అవసరం.

రాజకీయం కేవలం అధికార క్రీడ మాత్రమే కాదు. దానికి అధికారం ఒక సాధనం మాత్రమే. రాజకీయం పరిధి అంతకంటే విస్తృతమైంది, విశాలమైంది. ప్రజల దైనందిన జీవితంలో రాజకీయం స్పృశించని రంగం అంటూ ఏదీ వుండదు. సమాజహితం కోసం చేసే ప్రతి కార్యకలాపం రాజకీయమే. గ్రామం కోసం, రాష్ట్రం కోసం, దేశం కోసం చేసే ప్రతి పనీ రాజకీయమే. ఓ గాంధీ, ఓ అంబేద్కర్ చేసింది నిజమయిన రాజకీయం. అందుకే రాజకీయం ఒక పవిత్ర సామాజిక వ్యాసంగం.

ప్రజలు తమంతట తాము చేసుకోలేని పనులను చక్కబెట్టేది రాజకీయం. సమాజంలో వివిధ తరగతుల వారుంటారు, వారిమధ్య అంతరాలు, వ్యత్యాసాలు వుంటాయి. ఈ అంతరాలను అధిగమించి, సామరస్యాన్ని, అభివృద్ధిలో సమతూకాన్ని సాధించేది రాజకీయం. సమాజంలో వనరులు ఎప్పుడూ పరిమితంగా వుంటాయి. ప్రజల అవసరాలు అపరిమితంగా వుంటాయి. ఈ రెండింటికీ మధ్య వారధి కట్టేది రాజకీయం. ప్రజలు తమంతట తాము సమకూర్చుకోలేని విద్య, ఆరోగ్యం, ఉపాధి అవకాశాల కల్పనకు తగిన పరిష్కారాలను కనుగొనేది రాజకీయం. ప్రజల ఆకాంక్షలకు ఒక రూపం ఇచ్చి, దానికి ఒక లక్ష్యాన్ని నిర్దేశించి ప్రజల్ని లక్ష్యసాధన వైపు నడిపించేది రాజకీయం. సమాజహితం కోసం ప్రభుత్వాల ఏర్పాటుకు, నిర్వహణకు ప్రజల్ని సమీకరించేది రాజకీయం. ఇలాంటి మంచి రాజకీయం ఆధారంగా ఒక నూతన ప్రత్యామ్నాయాన్ని రూపొందించుకోవాలి.

## 2. కొత్త రాజకీయ సంస్కృతిని సాధించగల కొత్త తరహా రాజకీయపార్టీ

ప్రజలు రాజకీయ పక్షాల ద్వారా మాత్రమే ప్రత్యామ్నాయాన్ని చూడగలుగుతారు. అందుచేత మంచి రాజకీయాన్ని ఆచరణలోకి తీసుకురాగలిగిన ఒక కొత్త తరహా రాజకీయ పార్టీని రూపొందించాలి. ఇది ఏదో ఒక రాజకీయ పార్టీని ఏర్పాటు చెయ్యడం మాత్రం కాకూడదు. దానివల్ల ఎలాంటి ప్రయోజనం వుండదు. అది ప్రస్తుత రాజకీయాన్ని మార్చడం లక్ష్యంగా గల రాజకీయ పార్టీ అయివుండాలి. ఇదొక్కటి మాత్రమే ప్రస్తుత రాజకీయ సంధిదశకి నిజమైన పరిష్కారం అవుతుంది. అలాంటి పార్టీకి ఈ క్రింది మౌలిక లక్షణాలు వుండి తీరాలి. ఒక కొత్త రాజకీయ సంస్కృతికి ఒరవడిదిద్దేదిగా, దేశానికి మార్గాన్ని చూపేదిగా ఉండాలి.

### ఎ) ప్రజలే ప్రభువులు, పాలకులు సేవకులే

ప్రస్తుత రాజకీయాన్ని ఒక మలుపు తిప్పడం కొత్త రాజకీయ పార్టీ లక్ష్యం కావాలి. ఈ రాజకీయం తన అధికార క్రీడలో ప్రజల్ని కేవలం ఓటర్లుగా మిగిల్చింది. ఎన్నిక కాగానే పాలకులు ప్రభువులవుతున్నారు. ప్రజలు యాచకులవుతున్నారు. దీనిని తల్లకిందులు చెయ్యడం కొత్త పార్టీ నినాదం కావాలి. ఎన్నికైన వాళ్లు కేవలం ప్రజలు సేవకులుగా వ్యవహరించే నూతన రాజకీయ సంస్కృతి ఈ పార్టీకి ఆలంబన కావాలి.

చర్చాపత్రం

### బి) ధన రాజకీయాలకు స్వస్తి-ప్రజా రాజకీయాలకు నాంది

ప్రస్తుతం ధన రాజకీయం నడుస్తున్నది. ఈ రాజకీయం లాభసాటి వ్యాపారం కావడంతో అది సంపన్నులకీ, అవినీతిపరులకీ, అక్రమార్జన పరులకీ, నేరచరితులకీ నిలయం అయింది. రాజకీయం వీరికి కుటుంబ సొత్తుగా, అలంకారప్రాయమైన హోదాగా సాగిపోతున్నది. సామాన్యులకు రాజకీయం అందని ద్రాక్ష అయ్యింది. ఈ స్థితిని సమూలంగా మార్చడం కొత్త రాజకీయ సంస్కృతి లక్ష్యం కావాలి.

ఇందుకోసం ఏర్పడే కొత్త పార్టీకి పౌరులు కేంద్రం కావాలి. ఈ పార్టీలో సామాన్య ప్రజలు క్రియాశీల పాత్రధారులు కావాలి. పుట్టుకతో వివక్షతకు గురౌతున్న దళితులు, బలహీనవర్గాలు, మహిళలు, అభివృద్ధికి దూరంగా వున్న ఆదివాసీలు, మైనారిటీలు ఇతర తరగతులలోని పేదలు - ఎవరికి ప్రభుత్వసేవలు అవసరమో అలాంటి వారందరికీ ఈ కొత్త రాజకీయ పార్టీ వేదిక కావాలి. ఈ సామాన్య ప్రజలు రాజకీయంలో నిర్ణయాత్మక శక్తిగా ఎదగాలి. అందుకు ఈ పార్టీ వారిచేతుల్లో సాధనం కావాలి.

ప్రస్తుత ధన రాజకీయానికి ఈ ప్రజా రాజకీయమే విరుగుడు కావాలి.

### సి) పదవుల చుట్టూ తిరుగుతున్న రాజకీయాన్ని ప్రజల సమస్యల చుట్టూ తిప్పాలి

పదవి చుట్టూ తిరుగుతున్న ప్రస్తుత రాజకీయం, ఓట్లు కొల్లగొట్టే కళనే రాజకీయ కార్యకలాపంగా సాగిస్తున్నది. ప్రజాకర్షణ నినాదాలివ్వడం, ఎదుటివారి తప్పుల్ని ప్రచారం చెయ్యడం, స్థానికంగా వున్న అంతరాలని, విభేదాలని వినియోగించుకోవడం, మీదే ఆధారపడుతున్నది. కొత్త రాజకీయ పార్టీ దీనికి భిన్నంగా వ్యవహరించాలి. ప్రజాసేవలో ఆరోగ్యకరమైన పోటీనిరంగంలోకి

తేవాలి. ప్రజలకు విద్య, ఆరోగ్య సేవల్ని మెరుగుపర్చడం, యువతకు ఉపాధినైపుణ్యాలు, ప్రజల మధ్య సయోధ్య పెంపొందించడం, స్థానిక సమస్యల మీద, గ్రామీణాభివృద్ధి మీద ప్రజల్ని ఏకం చేసి పరిష్కారాలను సాధించడం -పౌరసేవల్ని మెరుగుపర్చడం ద్వారా ప్రజాజీవనాన్ని మరింత సుఖప్రదం చెయ్యడం తదితర ప్రజా సమస్యల చుట్టూ ఈ కొత్త పార్టీ కార్యకలాపాలు తిరగాలి. సమాజ హితం కోసం రాజకీయాలన్న కొత్త అర్థాన్ని ప్రజల ముందుంచే విధంగా ప్రజల భాగస్వామ్యంతో ఈ కార్యకలాపాలు నిర్వహించబడాలి.

### డి) రాజకీయం లాభసాటి వ్యాపారం కాదు, నిబద్ధత గల పవిత్ర సామాజిక వ్యాసంగం కావాలి

ప్రస్తుత రాజకీయం పై స్థాయినుండి కిందిస్థాయి వరకు లాభసాటి వ్యాపారం అయింది. అవినీతి వివిధ స్థాయిలలో విపరీతంగా పెరిగిపోయిందని అందరూ అంగీకరిస్తున్నారు. అయితే ఏ రూపంలో అవినీతి ఉన్నా, దానికి మూల కారణం రాజకీయంలోని లోపం. నేటి వికృత రాజకీయంలో అక్రమ నిధుల కోసం అంతులేని గిరాకీ ఉంది. కోటానుకోట్ల ఖర్చు, ఆర్భాటం లేకుండా రాజకీయాన్ని నిర్వహించటం నేటి ప్రధాన పార్టీలకి అసాధ్యం. డబ్బుతో నిరంతరం ముడిపడ్డ ఈ ధనరాజకీయానికి స్వస్తి చెప్పి, కొత్త రాజకీయాన్ని రూపొందించాలి. అందుకు ఈ కొత్త పార్టీ బాటలు వేయాలి. ఈ కొత్త పార్టీకి రాజకీయం ఒక నిబద్ధతగల వ్యాసంగం కావాలి. పార్టీలో అన్ని స్థాయిలలో ఇలాంటి నిబద్ధత గల నాయకత్వం వుండాలి. రాజకీయం ఒక సామాజిక కర్తవ్యంగా భావించి అంకితభావంతో పని చేసే కార్యకర్తలు వుండాలి. ఇలాంటి నిబద్ధత గల పార్టీ మాత్రమే కొత్త రాజకీయ సంస్కృతికి ప్రాతినిధ్యం వహించగలుగుతుంది. అందుకు తగిన విధంగా పార్టీని అన్ని స్థాయిలలో రూపొందించాలి.

### ఇ) లక్ష్యం నుండి వైదొలగకుండా స్వయం దిద్దుబాటుకు ఏర్పాట్లు

కొత్త రాజకీయ సంస్కృతి కోసం ఏర్పడే పార్టీ తన లక్ష్యాల నుండి వైదొలగకుండా వుండాలంటే దానిలో అన్ని స్థాయిలలో అంతర్గత ప్రజాస్వామ్యం వుండాలి. పెడధోరణులు తలెత్తితే చక్కదిద్దుకోగల స్వయం దిద్దుబాటు ఏర్పాటు వుండాలి.

ఇలాంటి పార్టీయే నూతన రాజకీయ సంస్కృతి సాధనకు మూల స్తంభంగా వుంటుంది. ఇలాంటి పార్టీయే సమస్యలో భాగం కాకుండా పరిష్కారంలో భాగం కాగలుగుతుంది. ఇలాంటి పార్టీయే ప్రస్తుత సంధిదశ నుండి రాజకీయ వ్యవస్థ బయట పడటానికి మార్గదర్శి కాగలుగుతుంది.

ఇలాంటి పార్టీయే ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడానికి తగిన ప్రత్యామ్నాయాన్ని అందించగలుగుతుంది.

నూతన రాజకీయ సంస్కృతిని సాధించడం కోసం ఇలాంటి నిబద్ధతగల రాజకీయపార్టీని రూపకల్పన చెయ్యడం అసాధ్యం కాదుగానీ, ప్రస్తుత పరిస్థితులలో కష్టతరమైంది. అయినా ఇలాంటి ప్రత్యామ్నాయ శక్తిని రూపొందించడం ఈనాటి చారిత్రక అవసరం. ఎంతటి కష్టతరమైంది అయినా ఇలాంటి చారిత్రక బాధ్యతను మంచి రాజకీయాన్ని కోరేవారంతా స్వీకరించాలి.

## 3. నూతన ప్రత్యామ్నాయం సాధించ తలపెట్టిన కొన్ని అంశాలు

నూతన రాజకీయం సంస్కృతి, నూతన ప్రత్యామ్నాయం అంతిమంగా ప్రజల జీవితాలను మెరుగుపర్చాలి. అందుకోసం నూతన ప్రత్యామ్నాయం ప్రతిపాదించాల్సిన కొన్ని అంశాలు.

ఎ) అవినీతికి, నేరచరితకి తావులేని స్వచ్ఛమైన మంచి రాజకీయాన్ని అందించడం

పాలనాయంత్రాంగంలో అవినీతిని వదిలించటం.

పారదర్శకమైన జవాబుదారీతనంతో కూడిన పాలనను అందించటం

బి) యువత ఉజ్వల భవిష్యత్తుకు ప్రణాళికలు

యువతకు శక్తి సామర్థ్యాలు పెంచే చదువు, ఉపాధి కల్పించే నైపుణ్యాలు అందించడం

పారిశ్రామిక వ్యవసాయ రంగాలతో యువత ఉపాధిని అనుసంధానం చేసే ప్రత్యేక పథకాలు

చర్చలో పాల్గొనండి
మీ అభిప్రాయాలు
పంపండి

సి) దళితులు, బలహీన వర్గాలు, మహిళలకు, ఆదివాసీలు, మైనారిటీలు రాజకీయరంగంలో, పరిపాలనాధికారంలో నిర్ణయాత్మక పాత్రధారులయ్యే విధంగా వారికి ప్రాతినిధ్యం కల్పించడం.

పేదల కుటుంబాలన్నిటికి ఇల్లు, కొంత భూ వసతి లేదా ఏదో ఒక స్థిరమైన ఆదాయవనరుల మీద యాజమాన్యం కల్పించడం ద్వారా వారి ఆర్థిక స్థితిగతులు మెరుగుపరచటం.

డి) విద్య-ఆరోగ్య వ్యవస్థలను చక్కదిద్దటం.
విద్య, ఆరోగ్య సేవలను సామాజిక అభివృద్ధికి కీలకమైన వృత్తులుగా ప్రకటించడం
సమాజంలో ఉపాధ్యాయులకు, వైద్యులకు ప్రత్యేక గౌరవ స్థానం కల్పించడం.

- పుట్టిన ప్రతిబిడ్డకీ కుల, మత, లింగ వివక్షతలు లేకుండా ఉన్నత ప్రమాణాలు గల విద్యను అందించడం
  దళితులు, బలహీన వర్గాలకి, ఆర్థికంగా వెనుకబడిన వారికి, బాలికలకి హైస్కూలు నుండి హాస్టలు వసతి
- అనారోగ్యం వల్ల ఎలాంటి ఆందోళనకి గురికాకుండ ప్రతి కుటుంబానికి ఆరోగ్యసేవలను అందించే విధంగా ప్రభుత్వ ఆరోగ్య వ్యవస్థలను సంస్కరించటం

**చర్చలో పాల్గొనండి మీ అభిప్రాయాలు పంపండి**

ఇ) రైతులకు వ్యవసాయాన్ని గిట్టుబాటు నుండి లాభసాటికి మార్చడం. అందుకు తగిన అన్ని ఏర్పాట్లు చేయడం.

ఎఫ్) ప్రతి జిల్లాకు ఒక స్థానిక ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడం. పట్టణం/మండలం, గ్రామానికి స్థానిక ప్రభుత్వాలు. వీటికి విధులు , నిధులు సిబ్బందిని బదలాయించటం. రాష్ట్ర బడ్జెట్‌లో జిల్లాల వారీగా ప్రత్యేక కేటాయింపులు, మొత్తం నిధులలో 40 నుండి 50 శాతం స్థానిక ప్రభుత్వాలకు కేటాయింపు. పట్టణ, నగరీకరణ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక ఏర్పాట్లు.

జి) సత్వర న్యాయం అందించడానికి స్థానిక కోర్టులు
రాజకీయాలకు అతీతంగా నేర పరిశోధనకు స్వయం ప్రతిపత్తి
ప్రజల ఫిర్యాదులపట్ల సానుకూలంగా స్పందించే పోలీసు వ్యవస్థ

హెచ్) పేదలందరికి గృహవసతికి ప్రత్యేక ప్రణాళికలు. మైనారిటీలు, వికలాంగులు, ఆదుకోవలసిన ఇతర తరగతుల వారందరికీ సంక్షేమ కార్యక్రమాలు, అవినీతి లేకుండా అర్హులకు అందే ఏర్పాట్లు.

ఐ) మద్యం అదుపునకు ప్రత్యేకమైన కార్యాచరణ ప్రణాళిక

## పునస్సమీక్షకు సమయం

ఏ సమాజంలో అయితే నీతి తప్పిన వారు విజయం సాధిస్తారో,
ఎక్కడయితే నేరస్తులు ఆరాధ్యులుగా మారుతారో,
ఎక్కడయితే విలువలు పతనమై అవకాశవాదం రాజ్యమేలుతుందో,
ఎక్కడయితే అసమర్థపాలన, ప్రజల ఉదాసీనత కొనసాగుతుందో,
ఎక్కడయితే అవినీతి సర్వత్రా తాండవిస్తున్నా కూడా పట్టించుకోకుండా,
తమకు కావల్సిన వాటాకోసం ప్రజలు అర్రులు చాస్తుంటారో
అక్కడ
"వ్యవస్థకు సంబంధించిన పునస్సమీక్షకు
సమయం ఆసన్నమైందని అర్థం"
అప్పుడు
తమ గురించి-తమకు సంబంధించిన వారి గురించి
తమ చుట్టూరా వున్నవారి గురించి- తమ కార్యకలాపాలకు సంబంధించి
అక్కడి పౌరులు అంతర్ముఖులు కావాలి.

- క్లిఫ్‌గార్డ్
ప్రఖ్యాత సామాజిక శాస్త్రవేత్త

లోక్‌సత్తా, 407
నిర్మల్ టవర్స్
ద్వారకాపురి కాలనీ,
పంజాగుట్ట,
హైదారాబాద్ - 82
ఫోన్ :040-23350778,
23350790
ఫాక్స్ : 23350783

Telugu Website : http://www.loksatta.org/Prajarajyam/index.html
Email : prajarajyam@loksatta.org